

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అమ్మ పెళ్ళి

**"అమ్మా! నువ్వు మళ్ళీ** పెళ్ళి చేసుకోవచ్చుగా" కీర్తి తల్లి మెడచుట్టూ చేతులు వేసి గారాబంగా అడిగింది.

"ఏం? ఓల్డ్ తెలుగు మూవీస్‌లో స్వాతి సినిమా చూసావా?" వైదేహి మృదువుగా అడిగింది.

"లేదు. రాత్రి ఎందుకో తట్టింది. ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు నీకు చెప్తామా అని 'ఇంకా తెలవారదేమి' అని బ్లాక్ అండ్ వైట్ పాట కూడా పాడుకున్నా" ఉత్సాహంగా చెప్పింది కీర్తి.

"కాలేజ్‌కి టైమైంది. వెళ్ళి స్నానం చేసి రా."

"ప్లీజ్ అమ్మా."

"కీర్తీ..!?"

ఆ కంఠంలోని మందలింపుని అర్థం చేసుకుని కాళ్ళు టపాటపా నేల మీద కొడుతూ "ఛీ నువ్వెప్పుడు ఇంతే. నా మాట వినవు." అని అరుస్తూ తనగదిలోకి వెళ్ళిపోయింది కీర్తి.

వైదేహి నవ్వుకుంది. చిన్నప్పటినించీ అలవిమాలిన కోరికలు అడగడం వద్దంటే 'నువ్వెప్పుడూ ఇంతే' అని అలగడం కీర్తికి అలవాటే.

'కుక్కపిల్లని పెంచుకుందాం'

'బోయ్ కట్ చేయించుకుంటా'

'సెలవులకి కాశ్మీర్ వెళ్దాం'

'నైట్ అవుట్ ఫ్రెండింట్లో పడుకుంటా'

అన్నిటికీ వైదేహి సమాధానం 'నో'నే. 'నువ్వెప్పుడూ ఇంతే నా మాట వినవు' అన్నది కీర్తి రియాక్షన్. కోరిక తీవ్రతని బట్టి గంట నించి ఒక పూట దాకా అలుగుతుంది. తర్వాత మామూలే.

ఈసారి మాత్రం రెండు రోజులు అలిగింది. వైదేహి కూడా బతిమాలే ప్రయత్నం చేయలేదు.

మూడోరోజు రాత్రి తల్లి గది తలుపు దగ్గర నిలబడి అడిగింది. "ఇవాళ నీ దగ్గర పడుకోవచ్చా?"

సంబోధన లేని ఆ అభ్యర్ధనకి నవ్వుకుని చదువుతున్న పుస్తకాన్ని పక్కన పెట్టి చేతులు చాపుతూ చెప్పింది.

"రా నాన్నా. నీకు పర్మిషన్ కావాలా?"

సుడిగాలిలా వచ్చి తల్లిని చుట్టేసుకుని ఆమె నుదిటి మీద ముద్దు పెడుతూ చెప్పింది కీర్తి.

"పెళ్ళయినప్పటినించి నాన్న బోర్డర్‌లో. నువ్వు ఇక్కడ. మధ్యలో నాన్న ఏడాదికి రెండు నెలలు సెలవులకి రావడం. అసలు మీ మధ్య అనుబంధం ఎక్కడుందమ్మా? నిజం చెప్పు నాన్న పోయాక మనం బాధపడ్డాం కానీ, ఆయన్ని మిస్ అయ్యామా? నాకు పద్దెనిమిది. నీకు పద్దెనిమిదో ఏట పుట్టానంటే అప్పుడు నీ వయసు ముప్పైఆరు. ఈ ఏజ్‌లో కొంతమంది పెళ్ళిళ్ళు కూడా చేసుకోవడం లేదు తెలుసా?"

కీర్తి మానసికంగా అంత ఎదిగిందని, తన గురించి అంత ఆలోచిస్తుందని తెలియని వైదేహి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"నేనిప్పుడు బానే వున్నా కీర్తీ. నాకు పెళ్ళి అవసరం అనిపించడంలేదు. మామయ్యకి చెప్పాను. నీకు సంబంధాలు చూడమని. డిగ్రీ అవగానే నువ్వు పెళ్ళిచేసుకో నా బాధ్యత తీరిపోతుంది" కూతుర్ని ఆప్యాయంగా హత్తుకుంది.

"నువ్వు పెళ్ళి చేసుకుంటేనే నేను చేసుకుంటా" చెప్పి అటు తిరిగి పడుకుంది కీర్తి.

అబ్బాయి అందంగా వున్నాడు. ఆస్ట్రేలియాలో ఉద్యోగం. నో చెప్పడానికి కారణం కనపడలేదు కీర్తికి.

పెళ్ళికూతుర్ని చేసిన రోజు తల్లిని పట్టుకుని గట్టిగా ఏడ్చేసింది.

"ఏమైంది నాన్నా? ఎందుకు ఏడుస్తున్నావు?" వైదేహి కంగారుగా అడిగింది.

"నువ్వెప్పుడూ ఇంతే. నా మాట వినవు. నా పెళ్ళి కంటే ముందే నీకు పెళ్ళి చేద్దామనుకున్నాను.."

ముక్కు పైగి ఎగబీల్చి అడిగింది.

"నిజం చెప్పమ్మా! నాన్నతో నువ్వేమైనా సుఖపడ్డావా? ఏడాదికి రెండు నెలలు రావటం. వచ్చాక ఆ చుట్టాలు, ఈ చుట్టాలు అని తిరగడం రైలెక్కడం. ఆయన మనకేదో రుణం కాబట్టి డబ్బు చెల్లించాడు కానీ నాకూ నీకు తండ్రిగా, భర్తగా ఏమిచ్చాడమ్మా?"

కూతురి కన్నీళ్ళు తుడిచి నెమ్మదిగా చెప్పింది వైదేహి.

"ప్లీజ్ కీర్తీ. ఇంటినిండా చుట్టాలున్నారు. గొడవచేయకు."

పెళ్ళయిన నెలలోపలే భర్త దగ్గరికి వెళ్ళిపోయింది కీర్తి. వెళ్ళేముందు తల్లిని జాలిగా అడిగింది.

"ఇంతదాకా నేనున్నాను. ఇప్పటినుంచి నువ్వు వంటరిగా ఎలా వుంటావమ్మా"

"నిక్షేపంగా వుంటాను. బాధపడకు. నా కాలేజ్, పుస్తకాలు, స్నేహితులు.... నేను బానే వుంటాను కీర్తీ. వంటరితనం నాకు" అలవాటే నవ్వింది వైదేహి.

"నమస్కారం వైదేహిగారు.. నేను శివానందం"

స్టాఫ్‌రూంలో కూర్చుని పరీక్షపేపర్లు దిద్దుతున్న వైదేహి తలెత్తి చూసింది. లూజుగా వేలాడుతున్న షర్ట్, ముక్కుమీదకి జారిన కళ్ళజోడు. అయోమయంగా కనిపిస్తున్న అతను ఎవరో ఆమెకి అర్ధంకాలేదు.

"నేను ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో చేరానండి" చెప్పాడతను.

"ఓ నేను ఇంగ్లీష్" చెప్పి దిద్దుతున్న పేపర్లలోకి చూడటంతో అతను పక్కనే వున్న కుర్చీలో కూర్చుని తను పాఠం చెప్పాల్సిన ఛాప్టర్ చదువుకోసాగాడు.

కొన్ని వారాల పరిచయం తర్వాత అతను అయోమయం కాదని, తెలివిగలవాడే అని వైదేహికి అర్థమైంది.

"మీ వారు బోర్డర్‌లో పోయారుట కదా! సారీ. దేశం కోసం ప్రాణమిచ్చారు" ఓ రోజు స్టాఫ్‌రూంలో ఇద్దరే వున్నప్పుడు అన్నాడు శివానందం.

"అవును. సియాచిన్‌లో పొరపాటున కిందకి దొర్లిపడి సహాయం అందేలోగా చలికి గడ్డకట్టిపోయారు." నిర్లిప్తంగా చెప్పింది.

"గాడ్! మా నిర్మల ఒళ్ళుకాలి నరకయాతన పడిపోయింది." బాధగా చెప్పాడు.

"ఏమిటి?" వైదేహి అదిరిపడింది.

"నేను కాలేజ్‌లో వున్నప్పుడు గాస్ లీకై..పోయింది. అందుకే అక్కడ వుండలేక ఈ వూరు వచ్చేసా. ఈలోగా చాలా వూళ్ళు తిరిగా"

"ఎంతకాలం క్రితం?"

"మూడేళ్ళయిందండీ."

క్లాస్‌కి టైమవడంతో ఆ సంభాషణ ముగిసింది.

"అమ్మా! ఇండియాటుడే విశేషాలు చెప్పు." కీర్తి ఫోన్ ఎత్తి అడిగింది.

"కీర్తీ రెండేళ్ళనాడు నువ్వు నన్నో కోరిక కోరావు గుర్తుందా?" వైదేహి అంది.

"నిన్ను చాలా కోరికలు అడిగాను. నువ్వేం తీర్చలేదు. అందులో ఏదో చెప్పు" కీర్తి నిష్టూరంగా చెప్పింది.

"అదేరా. నన్ను పెళ్ళిచేసుకోమన్నావుగా! శివానందం అని మా కాలేజ్‌లో ఫిజిక్స్ రీడర్‌గా..."

"అమ్మా!" కీర్తి పెద్దగా అరిచింది.

"అవును నాన్నా. వారి భార్య మూడేళ్ళక్రితం పోయింది. మేము పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాం" వైదేహి బిడియంగా చెప్పింది.

"అమ్మా! నీకేమైనా మతిపోయిందా? నలభైఏళ్ళొచ్చి ఇప్పుడు పెళ్ళేంటి? మా అత్తగారువాళ్ళు ఏమనుకుంటారు? ఈ సంవత్సరం నేను కన్సీవ్ అవుదామనుకుంటున్నాను. నువ్విక్కడికి వచ్చి బేబీని చూసుకోవాలి. "

"నువ్వే చెప్పావుగా కీర్తీ? " వైదేహి బలహీనంగా అడిగింది.

"చిన్నపిల్ల ఏదో చెపితే చేసెయ్యడమేనా? ఛీ నువ్వెప్పుడూ ఇంతే నా మాట వినవు. కనీసం ఈసారైనా విను. పెళ్ళి ఆలోచన మానెయ్." విసురుగా కాల్ కట్ చేసింది.

ఎప్పట్లాగే వైదేహి ఈసారి కూడా కూతురి మాట వినలేదు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story